క్లుప్తంగా

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం


నూతన కార్యవర్గ సభ్యులను సత్కరిస్తున్న నారాయణ తదితరులు

సీటీఆర్‌ఐ: భారత్ వికాస్ పరిషత్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు జిల్లా కోఆర్డినేటర్ పీవీఎస్ నారాయణ అన్నారు. ఆదివారం స్థానిక సూర్యహోటల్‌లో భారత్ వికాస్ పరిషత్ 2024–25 సంవత్సరం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం వర్క్‌షాప్ నిర్వహించారు. 60 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ పురుషోత్తమ శాస్త్రి, కోశాధికారి టి.సాయికృష్ణ, కొత్తపల్లి వీర్రాజు, వీవీఎస్ కృష్ణరావు తదితరులు పాల్గొన్నారు.

నాదస్వర విద్వాంసులు 'మంగమూరి' కన్నుమూత


మంగమూరి భాస్కరరావు (ఫైల్)


కడియం: ప్రముఖ నాదస్వర విద్వాంసులు, జేగురుపాడు సంగీత వాయిద్య మండలి వ్యవస్థాపకులు మంగమూరి భాస్కరరావు(85) ఆదివారం కన్నుమూశారు. జేగురుపాడు మ్యూజికల్ బ్యాండ్ టీం భాస్కరరావుగా ఉభయగోదావరి జిల్లాలతో పాటు విశాఖపట్నం తదితర ప్రాంతాల సంగీత ప్రియులకు ఆయన సుపరిచితులు. వృద్ధాప్యంతో ఇంటి వద్దే తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య, నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారులు కూడా సంగీత వాయిద్య కళాకారులుగా రాణిస్తున్నారు. ప్రముఖ కవి, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు గండి స్వామి ప్రసాద్ భాస్కరరావుకు అల్లుడు. కాగా నాదస్వరం, సన్నాయి, ట్రంపెట్, ఫ్లూట్, డ్రమ్స్ తదితర సంగీత వాయిద్యాల్లో ఆయన నిష్ణాతులు. ప్రఖ్యాత సంగీత విద్వాంసులు వెంకట్రావు వద్ద ఆయన సంగీత మెళకువలు నేర్చుకున్నారు. భాస్కరరావు మృతిపై విజయవాడ రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ గండి నాగేంద్రప్రసాద్, బ్యాంకింగ్ రంగ నిపుణులు ఎం.ప్రసాదరావు, విజయవాడ డివిజన్ రైల్వే స్కౌట్ మాస్టర్ గండి రాజేంద్ర ప్రసాద్, జేగురుపాడు గ్రామ సర్పంచ్ యాదల సతీష్ చంద్రస్టాలిన్, మాజీ ఎంపీటీసీ పాలపర్తి ప్రకాష్ కుమార్, యాదల మహేంద్రవర్మ తదితరులు సంతాపం తెలిపారు.

ఆలయ భూముల కౌలు హక్కుకు నేడు వేలం

సీతానగరం: మండలంలోని పలు ఆలయాలకు సంబంధించిన భూములపై కౌలు హక్కుకు సోమవారం ఉదయం బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్టు దేవదాయ, ధర్మదాయ శాఖ ఈఓ సోమాల శివ తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రఘుదేవపురం, సీతానగరం, మిర్తిపాడులలోని ఆలయాల భూములు భూసేద్యపు కౌలు హక్కుకు 2024–25 ఏడాది నుంచి 2026–27 ఏడాది వరకూ సుమారు మూడేళ్లకు ఆయా ఆలయాల వద్ద వేలం పాట నిర్వహిస్తామన్నారు. రఘుదేవపురంలోని రామలింగేశ్వర స్వామి వారి దేవస్థాన భూమి సర్వే నంబరు 530లో 6.77 ఎకరాలకు ధరావత్తు రూ.30 వేలు, సర్వే నంబరు 304లో 1.01 ఎకరాలకు రూ.10 వేలు, సర్వే నంబరు 82/1లో 0.71 సెంట్లకు రూ.5 వేలు ధరావత్తుగా చెల్లించి ఉదయం 10 గంటలకు వేలంలో పాల్గొనవచ్చన్నారు. అదేవిధంగా సీతానగరంలోని సీతారామస్వామి దేవస్థానం ఆలయ భూములు సర్వే నంబరు 682/1లో 2.85 ఎకరాలకు ధరావత్తు రూ.15 వేలు, సర్వే నంబరు 682/3 లో 7.57 ఎకరాలకు రూ.35 వేలు చెల్లించి మధ్యాహ్నం 12.30 గంటలకు నిర్వహించే బహిరంగ వేలంలో పాల్గొనవచ్చన్నారు. అలాగే మిర్తిపాడులోని వేణుగోపాలస్వామి వారి దేవస్థానం భూములు సర్వే నంబర్ 48లో 6.86 ఎకరాలకు ధరావత్తు రూ.30 వేలు, సర్వే నంబర్ 70లో 3.90 ఎకరాలకు ధరావత్తు రూ.15 వేలు చెల్లించి బహిరంగ వేలంపాటలో పాల్గొనవచ్చన్నారు. వేలంలో కైవసం చేసుకున్న కౌలు రైతులు మొదటి ఏడాది కౌలు సొమ్మును చెల్లించి భూమిలో పంట వేసుకోవచ్చని దేవదాయ, ధర్మదాయశాఖ ఈఓ శివ వివరించారు.

ముగిసిన వేసవి వాలీబాల్ శిక్షణ

కొవ్వూరు: స్థానిక గౌతమీ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవంతీ ఫౌండేషన్ సౌజన్యంతో పట్టణంలో నిర్వహించిన వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ పర్యవేక్షణలో స్థానిక ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో మే 1న ప్రారంభమైన ఈ శిక్షణ నెల రోజుల పాటు కొనసాగింది. సీనియర్స్ విభాగంలో 30 మంది రెసిడెన్షియల్‌గాను, పది మంది క్రీడాకారులు డే స్కాలర్స్‌గాను శిక్షణకు హాజరయ్యారు. ఇక జూనియర్స్ విభాగంలో నలభై మంది డే స్కాలర్స్‌గా శిక్షణ పొందారని క్యాంపు ఇన్‌చార్జ్ కొయ్యల ప్రసాద్ తెలిపారు. అనంతరం విద్యార్థులకు క్రీడా దుస్తులు, బూట్లు, సర్టిఫికెట్లు అందజేశారు.


మూతపడిన బాల్‌పూల్ కోర్టు


జారుడు బల్లల వద్ద ఏర్పాటు చేయని ఇసుక


స్ప్రింక్లర్లు పనిచేయక పోవడంతో దెబ్బతిన్న పచ్చిక


పార్కులో తాళం వేసిన మరుగుదొడ్డి

నిధులున్నా.. వేధిస్తున్న నిర్లక్ష్యం



ప్రకాశం నగర్ రౌండ్ పార్కు

- సమస్యలలో ప్రకాశం నగర్ రౌండ్ పార్కు
- చిన్నపాటి మరమ్మతులు చేయని అధికారులు
- నిర్వహణ లేక మరుగుదొడ్లకు తాళం
- నాలుగేళ్లుగా మూతపడిన పిల్లల బాల్‌కోర్టు
- ఐదేళ్లుగా జారుడు బల్లల వద్ద ఏర్పాటు చేయని ఇసుక
- ఇబ్బంది పడుతున్న ప్రజలు


పార్కులో పేరుకుపోయిన చెత్త

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తున్నా అధికారులు నిర్లక్ష్యం కారణంగా ప్రజా సౌకర్యాలు మృగ్యమవుతున్నాయి. నగరంలో కోట్లాది రూపాయలు వచ్చించి పలు పార్కులను ఆధునీకరించారు. అందులో ఒకటి ప్రకాశం నగర్ రౌండ్ పార్క్. ఆహ్లాదాన్ని కలిగించాల్సిన ఈ పార్క్ సమస్యలతో కొట్టుమిట్టాతోంది. నగరం నడిబొడ్డున ఉన్న ఈ పార్క్‌లో చిన్న చిన్న మార్పులు చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పార్కులో అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా అందుబాటులో ఉన్న సౌకర్యాలు ఉన్నప్పటికీ వినియోగానికి రాకపోవడంతో ఏమి చేయాలో తెలియడం లేదని స్థానికులు వాపోతున్నారు.

కాస్త పట్టించుకోవాలి



నిత్యం యోగా చేసే స్థలంలో చెత్త పేరుకుపోయింది. దీనిని ఎవరూ తొలగించడంలేదు. పారిశుధ్య అధికారులకు విజ్ఞప్తి చేసినా ఇప్పటి వరకూ పట్టించుకోలేదు. పార్కులో మరుగుదొడ్ల ఉన్నా లేనట్టే.. నిర్వహణ లేక తాళాలు వేసిన దుస్థితి ఉంది. ఆహ్లాదకరంగా ఉండాల్సిన పార్కులు సమస్యల మయంగా ఉంటే ఇబ్బంది పడుతున్నాం. అధికారులు పట్టించుకోవాలి.

– క్రొత్తపల్లి గీత, రాజమహేంద్రవరం

చిన్నారులకు గాయాలు



ప్రతి రోజు సాయంత్రం మా పిల్లలతో పార్కుకు వెళతాను. అక్కడ సరైన సౌకర్యాలు లేక దెబ్బలు తగులుతున్నాయి. జారుడు బల్లల వద్ద ఇసుక లేకపోవడంతో గాయాల పాలవుతున్నారు. ఆహ్లాదకరంగా పచ్చిక తయారయ్యేందుకు ఏర్పాటు చేసిన స్ప్రింక్లర్లు పనిచేయక పోవడంతో గడ్డి పూర్తిగా దెబ్బతింది. లైటింగ్ లేదు, బాల్ పూల్ కోర్టు అందుబాటులో లేదు. పార్క్‌కు వెళ్లాంటే చాలా ఇబ్బందికరంగా ఉంటోంది.

– మల్లిడి శ్రీనివాసరెడ్డి, ప్రకాశం నగర్

సమస్యలు ఇవే..

- ప్రకాశం నగర్ రౌండ్ పార్క్‌లో ఏర్పాటు చేసిన స్ప్రింక్లర్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతినడంతో పార్కులో ఎండలకు గడ్డి సైతం మారిపోయింది. వెంటనే నీటిని అందించాలి.
- చిన్నారులు ఆటలాడేందుకు సుమారు ఐదు ప్రాంతాల్లో జారుడు బల్లలను ఏర్పాటు చేశారు. అయితే చిన్నారులు జారిపడిన సమయంలో ఏ విధమైన గాయాలు తగలకుండా ఉండేలా ఏర్పాటు చేయాల్సిన ఇసుక వేయకపోవడంతో చిన్నారులు ఆటలాడుతూ తీవ్ర గాయాల పాలవుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- పార్కుకు వచ్చే సందర్శకులు మరీ ముఖ్యంగా మహిళలకు ఉపయోగపడాల్సిన మరుగుదొడ్లు సైతం నిర్వహణలో లేకపోవడంతో తాళం వేయాల్సిన పరిస్థితి నెలకొంది.
- నగరంలో ఎక్కడా లేనివిధంగా ఏర్పాటు చేసిన చిన్నారుల బాల్ పూల్ కోర్టు సైతం గత నాలుగేళ్లుగా మూతపడి ఉంది. ప్రతి ఆదివారం చిన్నారులకు అందుబాటులోకి తీసుకురావాల్సిన ఈ బాల్‌పూల్ కోర్టు అధికారులను నిర్లక్ష్యం వల్లే వినియోగంలో లేకుండాపోయింది. అలంకారప్రాయంగా ఉంది.
- పార్కులో వేసిన హైమాక్స్ లైట్స్ సక్రమంగా పనిచేయకపోవడంతో సాయంత్రం వేళలో పార్కుకు రావాలంటేనే భయంగా ఉంటుందంటూ స్థానికులు వాపోతున్నారు. విద్యుత్ వెలుగులు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. లైట్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, చర్యలు చేపట్టాలని అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదంటూ సందర్శకులు వాపోతున్నారు.
- నిత్యం ఉదయం పార్కులో యోగా చేసే ప్రాంతంలో ఆరు నెలలుగా చెత్త పేరుకు పోయిందని తొలగించాలంటూ అధికారులను కోరినా పట్టించుకోలేదని మహిళలు చెబుతున్నారు. యోగా చేస్తున్న సమయంలో చెత్త నుంచి తేళ్లు, విషకీటకాలు బయటకు వస్తున్నాయంటున్నారు.
- పార్క్‌లో ఉన్న మూడు వాటర్ ఫౌంటెన్ వద్ద లైటింగ్ పూర్తిగా దెబ్బతింది. నగరం నడిబొడ్డున ఉన్న ఈ పార్క్‌లో ఉన్న ఇబ్బందులను తొలగించేందుకు పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల పార్కు పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని స్థానికులు వాపోతున్నారు.
- ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక దృష్టిసారించి చిన్నారులు ఆడుకునే జారుడు బల్లల ప్రాంతాల్లో ఇసుకను, మరుగుదొడ్లను తెరిపించడం, చిన్నారులు ఆటలాడుకునేందుకు అనువుగా బాల్ పూల్ కోర్టును అందుబాటులోకి తీసుకురావాలని సందర్శకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పల్లెల్లో జోరందుకున్న పందేలు

- కోట్లలో సాగుతున్న బెట్టింగ్
- ఎవరికి వారే గెలుపుపై ధీమా

కడియం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సమయం దగ్గరపడే కొద్దీ గెలుపు గుర్రాలపై పందేలు జోరందుకున్నాయి. ఎగ్జిట్ పోల్స్ ఈ హీట్‌ను మరింత పెంచాయి. నిన్న మొన్నటి వరకు గెలుపు ఎవరిది? సీఎంగా ఎవరు వస్తారు? అన్న దానిపైనే పందేలు సాగాయి. అయితే ఇప్పుడు గ్రామ స్థాయికి కూడా పందేల జ్వరం అంటుకుంది. ఫలానా గ్రామంలో ఫలానా పార్టీకి ఎంత మెజార్టీ వస్తుంది? అన్న దానిపై కూడా పందేలు జోరుగా కాస్తున్నట్లు సమాచారం. మండలంలో మెజార్టీకి కూడా పందెం వేసేందుకు పలు రాజకీయ పార్టీల నుంచి సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. జూన్ నాలుగో తేదీన లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రస్తుతం పల్లెల్లో పందెంరాయుళ్ల హవా నడుస్తోంది. ఎండను సైతం ఎదురొడ్డి ఎన్నికల ప్రచారం, పోలింగ్ ప్రక్రియలతో తలమునకలై ఉన్న వివిధ పార్టీల నాయకులు ఇప్పుడు పందేల్లో జోరుగా పాల్గొంటున్నారు. ఔత్సాహిక పందెరాయుళ్లు చర్చలు జరుపుతున్నారు. ఆయా పార్టీలు, అభ్యర్థుల విజయావకాశాలపై ధీమాగా ఉన్న కొందరు ఔత్సాహికులు కోసుపందేలకు కూడా సిద్ధపడుతున్నారు. రూపాయికి రెండు రూపాయలు ఇస్తామంటూ ముందుకొచ్చి గెలుపు గుర్రాలపై పందెపు హీట్‌ను మరింత పెంచుతున్నారు. రూరల్ నియోజకవర్గం పరిధిలోని కడియం మండలంలో కోటి రూపాయలకుపైగా పందేలు సాగినట్టుగా చెబుతున్నారు.

విధిగా ఎన్నికల నిబంధనలు పాటించాలి

- కౌంటింగ్ ఏజెంట్లకు సూచనలు
- సౌత్‌జోన్ డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ అంబికాప్రసాద్, చిత్రంలో తహసీల్దార్లు అప్పారావు, రమాదేవి

రాజమహేంద్రవరం రూరల్: ఈనెల 4వ తేదీన నన్నయ్య యూనివర్సిటీలో జరగబోయే రాజమండ్రి రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ ఏజెంట్లు ఎన్నికల కమిషన్ నిబంధనలు తూచ తప్పకుండా పాటించాలని రాజమహేంద్రవరం సౌత్‌జోన్ డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక జాంపేటలోని పోలీసు కల్యాణ మండపంలో రూరల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ ఆదేశాల మేరకు రాజమండ్రి రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థుల కౌంటింగ్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఏజెంట్లు చేయాల్సిన, చేయకూడనవి విషయాలపై తెలియజేశారు. ఈసమావేశంలో డీఎస్పీ అంబికాప్రసాద్, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు, తహసీల్దార్లు కేవీఎస్ అప్పారావు, బి.రమాదేవి, ఇన్‌స్పెక్టర్లు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో కౌంటింగ్ ఏజెంట్లు అడిగిన పలు సందేహాలు ప్రశ్నలకు స్పష్టంగా వారికి అర్థమయ్యేలా విశదీకరించారు. ఎన్నికల కమిషన్ వారి సూచనలు, శాంతి భద్రతల దృష్ట్యా తీసుకుంటున్న చర్యలను వారికి వివరించారు. టుటౌన్, ధవళేశ్వరం, కడియం ఇన్‌స్పెక్టర్లు వి.శ్రీనివాస్, వినయ్‌మోహన్, బి.తులసీధర్‌లు పాల్గొన్నారు.

ఏజెంట్లు పాటించాల్సిన కొన్ని ముఖ్యాంశాలు

- కౌంటింగ్ ఏజెంట్లు ఏ రకమైన వస్తువులు, ఫోన్లు, వాలెట్లు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్, ఇతరత్రావంటి వాటిని కౌంటింగ్ సెంటర్‌కు తీసుకురాకూడదు.
- పోలింగ్ సమయంలో వారికి ఇచ్చిన వారం 17-సి పార్ట్-1 మాత్రమే కౌంటింగ్ ఏజెంట్లు తెచ్చుకోవచ్చు.
- కౌంటింగ్ ఏజెంట్లకు అవసరమైన పెన్ను, పుస్తకం వంటివి కౌంటింగ్ హాల్లో అధికారులు ఇస్తారు. కావున బయట నుంచి ఏ రకమైన సామగ్రి అనుమతించరు.
- రాజమండ్రి వైపు నుంచి నన్నయ్యయూనివర్సిటీలో ఉన్నటువంటి కౌంటింగ్ సెంటర్ కు వచ్చే ఏజెంట్లు తప్పనిసరిగా వారి వాహనాలను దివాన్ చెరువు వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాలలో వారి వాహనాలను పార్కు చేసి అక్కడ నుంచి జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన బస్సులలో మాత్రమే కౌంటింగ్ సెంటర్ వద్దకు వెళ్లాలి. వారి వాహనాలను దివాన్ చెరువు దాటి అనుమతించరు.
- రాజానగరం వైపు నుంచి వచ్చే కౌంటింగ్ ఏజెంట్లు తప్పనిసరిగా తమ వాహనాలను రాజానగరం దుర్గమ్మ గుడి సమీపంలో ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో పార్కు చేసి అక్కడ నుంచి జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన బస్సులలో మాత్రమే కౌంటింగ్ సెంటర్ వద్దకు వెళ్లాలి. వారి వాహనాలను రాజానగరం దుర్గమ్మ గుడి సెంటరు దాటి అనుమతించరు.
- రిటర్నింగ్ అధికారి వారు జారీ చేసిన గుర్తింపు కార్డు (ఐడెంటిటీ కార్డు), బ్యాడ్జిలను కౌంటింగ్ ఏజెంట్లు తప్పనిసరిగా పైకి కనిపించేలా పెట్టుకోవాలి.
- కౌంటింగ్ హాల్లో అనవసరంగా కేకలు పెట్టడం, దురుసుగా ప్రవర్తించడం, చట్ట వ్యతిరేకంగా ప్రవర్తించడం వంటివి చేస్తే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారు.
- నిబంధనల ప్రకారం కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరగడానికి అందరూ సహకరించాలి.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రాజమహేంద్రవరం సిటీ: ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌నకు విశేష స్పందన లభించిందని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ జవ్వార్, గౌరవ కార్యదర్శి మద్దుల మురళీకృష్ణ తెలిపారు. ఆదివారం మెయిన్ రోడ్డులోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో సుమారు 300 మందికి ఉచిత కంటి, దంత, గుండె, జనరల్ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేసినట్టు తెలిపారు. వంద మందికి కళ్లజోళ్లు అవసరమయ్యాయన్నారు. వారిని ఆదివారం అందజేస్తామన్నారు. 30 ఆపరేషన్లు చేయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ పరిధిలోని జట్టు కూలీలు, షాపుల్లో పని చేసే సిబ్బంది పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు అశోక్ కుమార్ జైన్, నందెపు శ్రీనివాస్, ట్రెజరర్ బలభద్ర వెంకట్రాజు, ట్రస్టుబోర్డు కార్యదర్శి శ్రీకనకాల రాజా, కార్యవర్గ సభ్యులు యక్కల నాగేశ్వరరావు, వలవల దుర్గా ప్రసాద్(చిన్ని), వివిధ సంఘాల ప్రతినిధులు, జట్టు లేబర్ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆయన మరణం పార్టీకి తీరని లోటు


పాపారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ పీఏసీఎస్ చైర్మన్, గ్రామ ఆర్బీకే చైర్మన్ నల్లమోలు పాపారావు మరణం పార్టీకి తీరని లోటని రాజానగరం నియోజకవర్గం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ఆదివారం కూనవరంలో పాపారావు పెదకార్యంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాల్గొని ఆయన చిత్రపటానికి పుష్పాలంకరణ చేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు సత్యనారాయణ, సూర్యచంద్రరావు, నరేష్‌లను పరామర్శించి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. విలేకరులతో మట్లాడుతూ గత నెల 23 న గుండెపోటుతో మరణించిన నల్లమోలు పాపారావు మరణం పార్టీకి తీరనిలోటని, పార్టీ విజయానికి ఎనలేని కృషి చేశారని, ఆయన సేవలు కొనియాడారు.

డివిజన్‌లో పోలీసు పికెట్ల ఏర్పాటు

కొవ్వూరు: ఈనెల 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న నేపథ్యంలో కొవ్వూరు పోలీసు సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలీసు పికెట్లు ఏర్పాటు చేసినట్టు డీఎస్పీ సీహెచ్ రామారావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఉదయం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పోటీలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థుల ఇళ్ల వద్ద గానీ, పార్టీ కార్యాలయాల వద్ద గానీ, శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా గ్రామాల్లో పోలీసు పికెట్స్ ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల సంఘం పేర్కొన్న మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకూడదన్నారు. బాణసంచా కాల్చడం, డీజేల ఏర్పాటు, లౌడు స్పీకర్లు ఏర్పాటు చేయడం వంటివి నిషేధమని డీఎస్పీ పేర్కొన్నారు. గ్రామాల్లో ఏవైనా గొడవలు జరుగుతున్నా, ఎవరైనా చట్ట ఉల్లంఘనలకు పాల్పడుతున్నా ఆ సమాచారాన్ని వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సబ్ డివిజన్ పరిధిలో పోలీసు స్టేషన్‌లకు వచ్చే ఫిర్యాదులను సత్వరం పరిష్కరించేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్న ఎస్సైలను హెచ్చరించినట్టు డీఎస్పీ ప్రకటించారు.

ప్రీమియర్ లీగ్ విజేత రాజా వారియర్స్


విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న విశ్వేశ్వరరెడ్డి

ప్రకాశంనగర్: మున్సిపల్ కాలనీ ప్రీమియర్ లీగ్ సీజన్ 10 క్రికెట్ టోర్నమెంట్‌లో రాజా వారియర్స్ జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం స్థానిక మున్సిపల్ గ్రౌండ్‌లో 40 రోజులపాటు జరుగుతున్న లీగ్ మ్యాచ్‌ల్లో రాజా వారియర్స్, వాంబే సూపర్ కింగ్స్ రెండు జట్లు ఫైనల్‌కి చేరుకున్నాయి. విజేతగా నిలిచిన రాజా వారియర్స్‌కు వైఎస్సార్ సీపీ నాయకులు టీకే విశ్వేశ్వరరెడ్డి ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాలతో శరీరక ధృడత్వంతో పాటు మానసికోల్లాసం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 42 వార్డు ఇన్‌చార్జి నామాన వాసు, బూసి వజ్రనాథ్, రఫీ, ఉమా, కోట, ఎండీ వజీర్, పురుషోత్తం, నాగార్జున, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల వారికి సేవలు


సమావేశంలో పాల్గొన్న సంస్థ సభ్యులు

సీటీఆర్ఐ: వాసవీ ఇంటర్నేషనల్ సౌజన్యంతో మిస్టర్ అండ్ మిసెస్ రాణి ప్రవీణ్ కపుల్స్ ఉల్లాసంగా ఉత్సాహంగా సాగింది. వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ వీ 215 ఏ డిస్ట్రిక్ గవర్నర్ కాళ్లకూరి కేవీపీఆర్ఎస్ ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో నిర్వహించారు. ఆదివారం స్థానిక ఎస్వీ పంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వాసవీ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎరుకుల రామకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలోనే పుట్టిన వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ సంస్థ 14 దేశాలలో సేవలందిస్తున్నారన్నారు. మన దేశంలో మహారాష్ట్ర, గుజరాత్, తెలంగాణ తదితర రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో సంస్థ సేవలు అందిస్తుందని తెలిపారు. ఇంటికి పరిమితమైన వైశ్య సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలను ఒక చోటకి చేర్చి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి వారి మధ్య పోటీ నిర్వహించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డిస్ట్రిక్ గవర్నర్ వి 215 కాళ్లకూరి కేవీపీఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ తాను ఈ పదవి చేపట్టినప్పుడు నుంచి ఎన్నో సేవా కార్యక్రమం నిర్వహించమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ బోడా సాయి సూర్యప్రకాష్, ప్రాజెక్ట్ చైర్పర్సన్ గ్రంధి సుజాత, వి.సునంద, సిహెచ్ ప్రసన్న లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	: గంగంగణేశా
సూర్యమినీ	: మిస్టర్ అండ్ మిసెస్ మహి
సూర్యప్యాలెస్	: భజేవాయువేగం
స్వామి	: భజేవాయువేగం
శివజ్యోతి	: లవ్‌మీ
అనుశ్రీ	: హిట్‌లిస్ట్
రాజా	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
ఊర్వశి	: ఆ ఒక్కటీ అడక్కు
రంభ	: రాజు యాదవ్
మేనక	: బాక్
అప్సర	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
కుమారి నామవరం	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
వీఎస్ మహల్ ధవళేశ్వరం	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
మురళీకృష్ణ కడియం	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
వెంకటసూర్య	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి, భజేవాయువేగం